40

# ఇసుక తక్కెడ - పేడ తక్కెడ

కొత్తపల్లి అనే ఒక ఊరు ఉండేది.

ఆ ఊరిలోక 'సుబ్బయ్య' అనే వర్తకుడు ఉండేవాడు. అతను బాగా డబ్బున్నవాడు. పట్నం నుంచి కిరాణా సరుకులు, ఇతర అవసరమైన వస్తువులు తెచ్చి ఊరిలో అమ్ముతుండేవాడు. అతనికి దురాశ ఎక్కువ. ఏ గడ్డి కరచైనా ధనం సంపాదించాలనుకునేవాడు. నూనెలు, సరుకులలో కల్తీ చేసేవాడు. డబ్బు సంపాదించడానికి ఇతరులను మోసం చేయడానికి వెనుకాడేవాడు కాదు.

కొత్తపల్లికి నలభైమైళ్ళ దూరంలో పాతపట్నం అనే మరో ఊరుంది. అందులో 'వెంకయ్య' అనే అతను ఉండేవాడు. అతను కూడా వ్యాపారియే. అతనికి చిల్లర దుకాణం ఉంది. సుబ్బయ్యలాగే అతను కూడా పట్నం నుంచి సరుకులు తెచ్చి తన దుకాణంలో అమ్ముతుండేవాడు. వెంకయ్య కూడా సుబ్బయ్యలాగే మోస ప్రవృత్తి ఉన్నవాడు.

కొత్తపల్లికి సుమారు ఇరవై మైళ్ళ దూరంలో 'నగరం' అనే ఊరు ఉండేది.

అది పెద్ద ఊరు. అక్కడ పెద్ద పెద్ద వర్తకులు చాలామంది ఉన్నారు. వాళ్ళు అన్నిరకాల సరుకులూ అమ్ముతారు. చుట్టుప్రక్కల ఊళ్ళ నుంచి వ్యాపారస్థులు అక్కడికి వచ్చి తమకి కావలసిన సరుకులు కొనుక్కుని వెళ్తుంటారు. నగరంలో సరుకులను టోకు ధరలకు కొని, తమ ఊళ్ళలో చిల్లర ధరలకు అమ్ముతుంటారు.

కొత్తపల్లినుంచి కూడా నగరం సుమారు ఇరవై మైళ్ళ దూరంలోనే ఉంది. అంటే... కొత్తపల్లికి, పాతపట్నానికీ మధ్యలో ఉందన్నమాట.

వెనుకటి రోజులలో ఇప్పటిలాగా రైళ్ళూ, బస్సులూ లేవు. అందుచేత ఏదైనా ఊరు వెళ్లాలంటే ఎడ్ల బండి మీద వెళ్లేవారు. లేదా...నడిచి వెళేవారు ధనికులైతే [illegible] వెళ్లేవారు.



ఒకరోజున సుబ్బయ్య సరుకులు కొనుక్కుని రావడంకోసం నగరానికి బయలుదేరాడు.

సుబ్బయ్య భార్య పేరు శాంతమ్మ. నగరం వెళ్లాలంటే ... ఇరవై మైళ్ళు బండిమీద వెళ్లాలి. లేదా... నడుచుకుంటూ వెళ్లాలి. సుబ్బయ్య పిసినారి మనిషి. ఎడ్లబండి మీద వెళ్లాలంటే బండి ఆసామీకి కిరాయి డబ్బులు ఇయ్యాలి. ఆ డబ్బు ఖర్చు కావడం అతనికి ఇష్టంలేదు. అందువల్ల నడిచే వెళ్లాలనుకున్నాడు.

ఇరవైమైళ్ళు నడిచివెళ్లాలంటే ప్రొద్దున్నెప్పుడో బయలుదేరితే, మధ్యాహ్నం మూడో,నాలుగో అవుతుంది. మరి, మధ్యాహ్నం భోజనం కావాలిగా! అందువల్ల భార్య శాంతమ్మని తనకి దారిలో తినడానికి ఏమైనా మూటకట్టి ఇమ్మన్నాడు.

"రాత్రి వండిన అన్నం మిగిలిపోయింది. దాన్లో పెరుగు కలిపి మూటకట్టి ఇస్తా!" అంది శాంతమ్మ.

'రాత్రి అన్నం మిగిలింది...' అనగానె సుబ్బయ్యకి ఒక ఆలోచన వచ్చింది.

ఎను ఎలాగూ ఊరు వెళ్తున్నాడు. మిగిలిన అన్నం భార్య తినేస్తే ఆ పూటకి వంట చేయ నక్కరలేదు.., కట్టెలు కూడా ఆదా అవుతాయి.

వెంటనే శాంతమ్మతో, "ఆ అన్నం నువ్వే తిను. నేను ఏదో చూసుకుంటాలే!" అన్నాడు.

"దారిలో ఏమి దొరుకుతుందీ..?" అంది శాంతమ్మ.

"శతకోటి అపాయాలకు అనంతకోటి ఉపాయాలు!' అన్నారు. పట్నానికి వెళ్లేవారు దారిలో ఎవరైనా కనిపించక పోతారా? వాళ్ళకి నాలుగు మాయమాటలో, మంచిమాటలో చెప్పి, వాళ్ళు తెచ్చుకున్న దాంట్లో కొంత నేనూ తింటాను" అన్నాడు సుబ్బయ్య.

"సరే...మీ ఇష్టం!" అని పనిచేసుకోడానికి లోపలికి వెళ్లిపోయింది శాంతమ్మ.

సుబ్బయ్య తిన్నగా పశువుల కొట్టంలోకి వెళ్లాడు.

గట్టిగావున్న ఆవుపేడని లేత అరిటాకులో పెట్టి చుట్టాడు. దానిని తుండులో మూటకట్టి భుజాన వేసుకున్నాడు. అవసరమైన డబ్బూ, సంచులూ తీసుకుని ఊరికి బయలుదేరాడు.

అదే రోజున వెంకయ్య కూడా సరుకులు కొనుక్కుని రావడానికి నగరానికి బయలుదేరాడు. వెంకయ్య కూడా బాగా పిసినారి. అతను వెళ్తుంటే 'అన్నం మూటకట్టి ఇస్తా'నని అంది అతని భార్య నరసమ్మ.

"అదో బరువు కూడానా...? నాకు అన్నం ఏమక్కరలేదు" అన్నాడు వెంకయ్య.

"దారిలో ఆకలివేయదూ..? పోనీ, అటుకులు మూట కట్టిస్తాను...తీసుకువెళ్లండి" అంది నరసమ్మ.

"ఓసీ పిచ్చిమొహమా... అది మాత్రం ఎందుకు? ఉపాయం లేనివాడిని ఊరినుంచి వెళ్లకొట్ట మన్నారు. ఏదో ఉపాయం చేసి దారిలో ఎవరి దగ్గరైనా వాళ్ళు తెచ్చుకున్న అన్నాన్ని తింటాలే..!" అన్నాడు వెంకయ్య.

"మీ ఇష్టం..!" అని పని చేసుకోడానికి లోనికి వెళ్లిపోయింది నరసమ్మ.

భార్య 'అటుకులు' అనగానే వెంకయ్య బుర్రలో ఒక ఆలోచన మెదిలింది.

వెంటనే దొడ్డిలోకి వెళ్లాడు.

అక్కడ ఇల్లు కట్టగా మిగిలిన గండ్రఇసుక కొంత గుట్టగా పోసి ఉంది. తన పైబట్టను నేలమీద పరిచాడు. రెండు దోసిళ్ళు శుభ్రమైన గండ్రఇసుకని తీసి అందులో పోసి గట్టిగా మూటకట్టాడు. ఆ మూటని భుజాన వేసుకొని ఊరికి బయలుదేరాడు వెంకయ్య.

అలా సుబ్బయ్యా, వెంకయ్యా చెరో వైపునుంచీ నగరానికి బయలుదేరారు.

ఆ రెండు దారులూ మధ్యలో ఒకచోట కలిసి అక్కడినుంచి ఒకే బాటగా నగరంవైపు సాగుతాయి. అక్కడ ఎవరో ధర్మాత్ముడు కట్టించిన ధర్మసత్రం ఒకటుంది. అక్కడ బాటసారులకి భోజన సమయానికి అన్నం పెట్టారు.

అక్కడికి చేరేసరికి పదకొండు గంటలు కావస్తుంది. అది భోజన సమయం. అందువల్ల వచ్చిన బాటసారులందరితోపాటు వెంకయ్యకీ, సుబ్బయ్యకీ కూడా భోజనం పెట్టారు.

భోజనం చేశాక, విశ్రాంతి తీసుకుంటూ సుబ్బయ్యా, వెంకయ్యా కబుర్లు చెప్పుకోసాగారు. ఇద్దరూ ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు.

"మనం భోజన సమయానికి ఇక్కడికి వచ్చాం. అందువల్ల కమ్మని భోజనం దొరికింది. పాపం... మా ఆవిడ దారిలో తినమని గట్టి పెరుగన్నం మూటకట్టి ఇచ్చింది. అది తినడమే పడలేదు" అన్నాడు వెంకయ్య.

'పెరుగన్నం'... అనగానే వెంకయ్యకి నోరూరింది. అతనికి పెరుగన్నం చాలా ఇష్టం.

"అలాగా... నువ్వు పెరుగన్నం తెచ్చుకున్నావా?! నాకు పెరుగన్నం అంటే ఎంతో ఇష్టం. కాని, మా ఆవిడ పెరుగన్నం దారిలో పాడయిపోవచ్చునని చెప్పి, అటుకులు మూటకట్టి ఇచ్చింది. నాకు అటుకులు పెద్దగా ఇష్టం ఉండదు" అన్నాడు.

'అటుకులు'...అనగానే సుబ్బయ్యకి నోరూరింది. అతనికి అటుకులంటే బాగా ఇష్టం.

"నువ్వు అటుకులు తెచ్చుకున్నావా..?! నాకు అటుకులంటే బాగా ఇష్టం. పెరుగన్నం ఇష్టం ఉండదు. అయినా, చలవ చేస్తుందని అదే కట్టి ఇచ్చింది మా ఆవిడ!" అన్నాడు సుబ్బయ్య.

"అయితే ఒక పని చేద్దాం. మనిద్దరం మూటలు మార్చుకుందాం. ఇంకా నాలుగు గంటలు ప్రయాణం ఉందిగా. ఓ రెండు గంటల తర్వాత ఎక్కడైనా తినవచ్చు. అప్పటికి ఆకలి కూడా వేస్తుంది" అన్నాడు వెంకయ్య.

"అలాగే చేద్దాం!" అన్నాడు సుబ్బయ్య. ఇద్దరూ మూటలు మార్చుకున్నారు.

"నేను కొంచెంసేపు నిద్రపోయి బయలుదేరుతాను" అన్నాడు వెంకయ్య.

"నేను ఇప్పుడే బయలుదేరుతాను" అన్నాడు సుబ్బయ్య.

ఇద్దరూ కలిసివెళ్తే దారిలో తమ రహస్యాలు బయటపడ్తాయని వెంకయ్య, సుబ్బయ్యలు వేరువేరుగా బయలుదేరారు.

ఓ రెండు గంటల తర్వాత దారిలో ఒక చిన్న ఊరు వచ్చింది. అక్కడ ప్రయాణీకుల విశ్రాంతికోసం ఒక మంటపం ఉంది. అక్కడకి చేరగానే, పెరుగన్నం తిందామని కూర్చుని మూట విప్పాడు వెంకయ్య. అందులో పేడ ఉండడం చూసి నిశ్చేష్టుడయిపోయాడు.

"అరే.., ఇందులో పేడ పెట్టి, పెరుగన్నం అని నన్ను నమ్మించాడే-వెంకయ్య! నేనే అనుకుంటే, నన్ను మించినట్లున్నాడే..!!" అన్నాడు బిగ్గరగా.

ఆ వెనకనే ఒక బైరాగి కూర్చుని ఉన్నాడు. సంగతి గ్రహించాడు అతను.

"తాడిని తన్నేవాడు ఒకడుంటే దాని తలను తన్నేవాడు మరొకడుంటాడు" అని కళ్ళు మూసుకున్నాడు బైరాగి.

తేలు కుట్టిన దొంగ లాగా కిక్కురుమనకుండా ఆ పేడను అవతల పారవేసి, తిరిగి బయలుదేరాడు వెంకయ్య.

మరికొంచెంసేపటికి సుబ్బయ్య అక్కడికి వచ్చాడు. ఆ మంటపంలో కూర్చుని అటుకులు తిందామని మూటవిప్పాడు. అందులో అటుకుల బదులు గండ్ర ఇసుక ఉండడం చూసి కొయ్యబారిపోయాడు.

"నేను పేడ మూట ఇచ్చి మోసం చేస్తే.., ఈ వెంకయ్య ఇసుక ఇచ్చి మోసం చేశాడు. నన్ను మించినట్టున్నాడు" అన్నాడు బిగ్గరగా.

ఇదంతా గమనిస్తున్న బైరాగి- "లింగాన్ని మింగేవాడు ఒకడుంటే.., గుడితో సహా మింగే వాడింకొకడుంటాడు. అందుకనే...'చెరపకురా చెడేవు' అన్నారు పెద్దలు !" అని మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

వినాయకుడి బొడ్లో వేలు పెడితే తేలు కుట్టినట్లు- నోరెత్తకుండా ఆ ఇసుకను అవతల పారబోసి, ఊరికి బయలుదేరాడు సుబ్బయ్య. బైరాగి కూడా వెనకాలే బయలుదేరాడు.

మరికొంతసేపటికి నగరం పొలిమేర వచ్చింది. అప్పటికే వెంకయ్య అక్కడికి వచ్చి, మంటపంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు.

అతన్ని చూడగానే సుబ్బయ్య - "వెంకయ్యా...పెరుగన్నం తిన్నావా?" అని అడిగాడు.

"ఆ...తిన్నాను. ఎంత బాగుందో.., ఎంతో గట్టి పెరుగు. ఏమి రుచో..!" అంటూ లొట్టలేసి, "నువ్వు అటుకులు తిన్నావా?" అని అడిగాడు.

"ఆ...తిన్నాను. ఎంత బాగున్నాయో.., కరకరలాడుతూ ఎంత తాజాగా ఉన్నాయో..! అంత మంచి అటుకులు నేను ఎప్పుడూ తినలేదు" అన్నాడు సుబ్బయ్య.

ఇంకా ఎక్కువ మాట్లాడకుండా ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.

అప్పటినుంచే 'ఇసుక తక్కెడ - పేడ తక్కెడ' అన్న సామెత వచ్చింది. ఒకర్నొకరు మోసం చేసుకునేవారిని గురించి చెప్పేటప్పుడు ఈ సామెత వాడతారు.

★★★